ప్రజాశక్తి

గురువారం 24 జులై 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

వైసిపి బాటలోనే కూటమి

సహకార సంఘాల్లో నామినేటెడ్ నియామకాలు - గత ప్రభుత్వ విధానమే కొనసాగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇంత వరకు దృష్టి సారించలేదు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించక ఏడు ఏళ్లు దాటింది. గత ప్రభుత్వంలో మాదిరిగానే నామినేటెడ్ పద్ధతిలో పాలక మండళ్ల నియామకాలను టిడిపి కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. 2021 నుంచి 2024 వరకు వైసిపి నాయకులతో సహకార సంఘాల్లో నామినేటెడ్ పద్ధతిలో కమిటీలను కొనసాగించగా తాజాగా కూటమి ప్రభుత్వం కూడా టిడిపి స్థానిక నాయకులతో సహకార సంఘాలకు కమిటీలను నియమిస్తోంది.

ఉమ్మడి జిల్లాలోని 167 సహకార సంఘాలకు పాలక వర్గ కమిటీల నియామక ప్రక్రియ గత వారం రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటికే డిసిసిబి పర్సన్ ఇన్‌ఛార్జిగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నామినేటెడ్ పద్ధతిలో కమిటీ ఏర్పాటైంది. డిసిఎంఎస్‌కు పొన్నూరు నియోజకవర్గానికి చెందిన టిడిపి



నాయకుడు వడ్రాణం హరిబాబును చైర్మన్‌గా నియమించారు. జిల్లాలోని 167 సంఘాలకు కమిటీల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్నదీ సమాచారం లేదని కేవలం కమిటీల నియామకంపై ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఉత్తర్వులు ఇస్తున్నారని అధికారులు తెలిపారు.

2013లో ఉమ్మడి రాష్ట్రంలో సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర విభజన తరువాత 2018 వరకు ఈ పాలక మండళ్లు కొనసాగాయి. అప్పట్లో డిసిసిబి చైర్మన్‌గా ముమ్మనేని వెంకటసుబ్బయ్య ఎన్నికయ్యారు. 2018లో సహకార సంఘాల్లో పాలక మండళ్ల గడువు పూర్తి కావడంతో కొంత కాలం పాటు పాత కమిటీలనే అప్పటి టిడిపి ప్రభుత్వం కొనసాగించింది. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పటి పాలక మండళ్ళను రద్దు చేసింది. తరువాత ఏడాదిన్నర పాటు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించారు. 2021 నుంచి 2024 వరకు డిసిసిబి చైర్మన్‌గా రాతంశెట్టి సీతారామాంజనేయులు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్‌గా వై.భాగ్యలక్ష్మీ పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసిపి నియమించిన కమిటీలను తొలగించి కొద్ది రోజులు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అయితే త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని గత జనవరిలో మంత్రి అచ్చెంనాయుడు గుంటూరులో ప్రకటించారు. కానీ ఎన్నికలను నిర్వహించకుండానే వారం రోజులుగా నామినేటెడ్ పద్ధతిలో నియామకాలు చేపట్టారు. ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో అధికారులు ఇటీవల రికార్డుల కంప్యూటరీకరణ చేశారు.

అంతేగాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ▶ 2లో



మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో నాయకులు
- సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు తిప్పికొట్టేందుకు, హక్కుల కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక పాతగుంటూరులోని శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 8వ మహాసభ ఎన్.సత్యనారాయణరాజు నగర్‌లో బుధవారం నిర్వహించారు. తొలుత ఫెడరేషన్ జెండాను రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రమణరావు, సిఐటియు జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు ఎగురవేశారు. మహాసభ ప్రతినిధులు అమర వీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమణరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం పట్టించుకోకుండా అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగాన్ని అదుపు చేయలేక పోయాయన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగాయని, కార్మికుల వేతనాలు మాత్రం పెరగలేదని అన్నారు. పెరిగిన ధరలతో ఒక్కొక్క కుటుంబంపై దాదాపు రూ.లక్ష రూపాయాల భారం పెరిగిందన్నారు. మరోవైపు విద్యుత్ ఛార్జీలు, రకరాల పన్నులు పెంచుతూ భారం మోతుపుతున్నారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ బాటలోనే చంద్రబాబు పయనిస్తూ లేబర్ ▶ 2లో

పల్నాడు జిల్లాలో హత్యల కలకలం

- పాతమాగులూరులో తండ్రికొడుకుల హత్య
- నరసరావుపేట కోర్టుకు వస్తుండగా ఘటన
- పిడుగురాళ్లలో హత్య చేసి నంద్యాలకు మృతదేహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు సమీపంలోని పాతమాగులూరు గ్రామంలో తండ్రీకొడుకుల హత్య, భర్తను చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఉదంతం బుధవారం పల్నాడు జిల్లాలో కలకలం రేపాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పాతమాగులూరులో ఒ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో తండ్రీకొడుకులు బుధవారం ఉదయం హత్యకు గురయ్యారు. బెంగుళూరుకు చెందిన కె.వీరాస్వామి రెడ్డి (62), అతని కుమారుడు కె.వి.ప్రసాదరెడ్డి (37) మంగళవారం సాయంత్రం కోర్టు పనిమీద నరసరావుపేటకు వచ్చారు. తిరిగి వాయిదా నిమిత్తం బుధవారం నరసరావుపేట కోర్టుకు బయలుదేరుతుండగా వారిని రెండు వాహనాల్లో వచ్చిన ఆరుగురు కిడ్నాప్ చేశారు. పాతమాగులూరు వద్ద కిడ్నాప్ చేసి ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లోకి తీసుకువెళ్లి ఇద్దర్నీ గొంతుకోసి చంపి పరారయ్యారు. ఆర్థిక లావాదేవీలే హత్యలకు కారణమని తెలుస్తోంది. సంతమావులూరు ప్రాంతానికి చెందిన





అనిల్‌రెడ్డి అనే వ్యక్తితో వీరాస్వామిరెడ్డికి ఆర్థిక వివాదాలు ఉండటమే ఈ హత్యలకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. అనిల్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. తొలుత ఒక వాహనంలో పరారైన నిందితులు అ వాహనాన్ని చిలకూరిపేట వద్ద వదిలేసి మరో వాహనంలో పారిపోయారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. వీరస్వామిరెడ్డి, ప్రసాదరెడ్డి మృతదేహాలను నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన నరసరావుపేటకు సమీపంలో జరగడం, కోర్టుకు వస్తుండగా హత్య జరగడం పల్నాడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

పిడుగురాళ్లలో హత్య... మృతదేహం డోర్ డెలివరీ...

నంద్యాలకు చెందిన పెయింటర్ శేషాచలం (48)తో ▶ 2లో

విద్యుత్ షాక్‌తో కౌలురైతు మృతి

మోటారు ఆన్‌చేస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి- రెంటచింతల

పొలంలోని బోరు మోటారును స్టార్ట్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కౌలురైతు మృత్యువాతపడ్డాడు. మండలం కేంద్రమైన రెంటచింతలలోని ఏడుమంగళం వాగువడ్డున బుధవారం జరిగిన ఘటనపై ఎస్ఐ నాగార్జున వివరాల ప్రకారం.. మండలంలోని మంచికల్లు గ్రామానికి



చెందిన బొమ్మనబోయిన నరసింహారావు (42) రెంటచింతల పరిసర ప్రాంతాల్లో 30 ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేపట్టాడు. బుధవారం పొలానికి వెళ్లిన ఆయన మాగాణి పొలంలోని మోటారు బోరును స్టార్ట్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఆయన చేయి పొరపాటున ప్యానల్ బాక్స్‌కు తగలడంతో విద్యుత్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లు పెడితే మరిన్ని భారాలు

- 5న అన్ని పట్టణాల్లోనూ ధర్నాలు, సబ్‌స్టేషన్‌లలో వినతులు
- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యుత్ స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై మరిన్ని భారాలు పడతాయని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. స్మార్ట్‌మీటర్ల ప్రమాదంపై పట్టణంలోని ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం పట్టణ పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. స్మార్ట్ వీటర్లకు వ్యతిరేకంగా తీర్మానం చేయడంతోపాటు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ అదానీ కంపెనీలకు లాభం చేకూర్చడానికే స్మార్ట్ మీటర్లని, వీటి ఖరీదును 93 నెలలపాటు ప్రజలపై వేయడంతోపాటు బిల్లుల భారాన్నీ ప్రభుత్వం మోపనుందని చెప్పారు. ఇప్పటికే వివిధ రకాల ఛార్జీలతో కలిపి కరెంటు బిల్లు రెట్టింపు వస్తోందని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్లు, భారాల విషయంలో వైసిపి, కూటమి ప్రభుత్వాలకు తేడాఏమీ లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే విద్యుత్ వినియోగంలో కీలకమైన సమయాల్లో అధికంగా వసూలు చేస్తారని, ముందుగా రీఛార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుందని, అది అయిపోయిన వెంటనే సరఫరా నిలిచిపోతుందని వివరించారు. ఈ విధనాలకు వ్యతిరేకంగా 5న అన్ని పట్టణాల్లో ధర్నాలు చేయడంతోపాటు ▶ 2లో

వైసిపి బాటలోనే కూటమి

(మొదటి పేజీ తరువాయి)

(పిఎసిఎస్) ప్రస్తుతం ఉన్న సభ్యుల వివరాలను అప్‌డేట్ చేయాలని, ప్రధానంగా ప్రతి రైతు చేత ఈకేవైసి చేయించి స్థానిక చిరునామాతో నిర్ధారణ చేయాలని ప్రభుత్వం సూచించింది. రూ.300 షేర్ ధనంతో సభ్యులుగా చేరు వారు స్థానికంగా పాస్‌బుక్, ఆధార్ కార్డు కలిగి ఉన్న చిరునామాతో వివరాలు ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరణ చేశారు. ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మంది సభ్యులు ఉన్నారు. కొత్త సభ్యుల చేరిక కూడా అవకాశం కల్పిస్తామన్నారు. ఇంత వరకు ఇందుకు సంబంధించి ఉత్తర్వులు రాలేదు. తాజాగా నామినేటెడ్ కోటా పాలక మండలులు నియామకం చేపట్టడం వల్ల ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశాలు లేవని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పల్నాడు జిల్లాలో హత్యల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

పిడుగురాళ్లకు చెందిన రమణ అనే యువతికి కొన్ని ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్యభర్తలు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో రమణ కొద్ది రోజుల క్రితం పిడుగురాళ్ల వచ్చింది. తన తల్లికి ఆరోగ్యం బాగా లేదని భార్య రమణ చెప్పగా శేషాచలం కూడా పిడుగురాళ్ల వచ్చాడు. సోమవారం రాత్రి రమణ, శేషాచలం మధ్య ఘర్షణ జరిగింది. బంధువుల సాయంతో రమణ భర్త శేషాచలంను చంపి మృతదేహాన్ని నంద్యాలలో భర్త నివాసానికి తీసుకువెళ్లినట్లు ఆమె కుమార్తెలు జ్యోతి, చందన నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేపట్టారు.

స్మార్ట్ మీటర్లు పెడితే మరిన్ని భారాలు

(మొదటి పేజీ తరువాయి)

సబ్‌స్టేషన్‌లలో వినతిపత్రాలు ఇద్దామని, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు ముందుగా ఈ చిలకలూరిపేట నుండే చేస్తున్నారన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే గంటగంటకూ రీడింగ్ మారుతుందని, విద్యుత్ రంగమే ప్రైవేటుపరం అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ ఇప్పటికే ప్రజలపై రూ.16 వేల కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారం పడిందన్నారు. అనంతరం నల్లమల రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజామోహన్‌రావు, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎం.భానుప్రసాద్, సిపిఐ నాయకులు షేక్ సుభాని మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నాయకులు ఇప్పుడెందుకు ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై ప్రజలకు సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.మోహన్‌రావు, సిపిఐ నాయకులు పి.రామారావు, ఎన్.సుబ్బాయమ్మ, పి.రామారావు, జనక్రాంతి రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే గౌస్, జనవిజ్ఞాన వేదిక నాయకులు బుజ్జిబాబు, బి.సి. యునైటెడ్ ఫ్రంట్ పార్టీ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, నాయుడు శివ, బాజి, నాగభూషణం, ఎస్.ఉస్థర్, ఎస్.బాబు, అపార్ట్మెంట్ సంఘాల అధ్యక్షులు నాగభూషణం పాల్గొన్నారు.

మైనారిటీల కోసం లైబ్రరీకి శంకుస్థాపన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మున్సిపల్ కార్యాలయ సమీపంలోని జామియా మసీదు వద్ద రూ.10 లక్షల ఎంపీ నిధులతో మైనారిటీల కోసం లైబ్రరీ భవనానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంజుమన్ కాంప్లెక్స్ నిర్మాణం ఆగిపోయిందని, ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేస్తామని చెప్పారు. జామియా మసీదు నిర్మాణం కొనసాగుతోందన్నారు.




బడికి నీటిగండం

- వర్షమొచ్చిన ప్రతిసారీ నీటి ఊట..
- విద్యార్థుల సంఖ్యపై ప్రతికూల ప్రభావం
- అంగన్వాడీ కేంద్రంలో తరగతులు



ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని వంగిపురం మండల పరిషత్ పాఠశాల (బి.ఎఫ్.ఎస్)ను గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనుల్లో భాగంగా తీర్చిదిద్దారు. అయితే అవన్నీ హంగులే మినహా సమస్యల పరిష్కారం కాదని బుధవారం నాటి వర్షంతో తేటతెల్లమైంది. వర్షపడిన ప్రతి సందర్భంలోనూ ఈ పాఠశాలల తరగతి గదుల్లోకి దాదాపు మోకాళ్లలోతు నీరు వస్తుంటుంది. వీటిని మోటార్లతో బయటకు తోడించినా మళ్లీ ఊరతాయి. ఎండలు వచ్చేవరకూ ఇదే దుస్థితి. కొన్నేళ్లపాటు ఇలాంటి దుస్థితిని అనుభవిస్తున్న పాఠశాల నుండి అనేక మంది విద్యార్థులను తల్లిదండ్రులు ఇతర ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేసినా విద్యార్థుల సంఖ్య పెరగకపోగా తగ్గుదలే కనిపిస్తోంది. తల్లిదండ్రులు ఇళ్లకు వెళ్లి ఎంత నచ్చజెప్పినా వారి పిల్లల్ని తమ బడిలో చేర్చడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాల భవనాన్ని కూల్చేసి మెరుగైన వసతులతో కొత్త భవనాలు నిర్మిస్తే పిల్లల్ని చేర్పిస్తామని స్థానికులు అంటున్నారు. తాజాగా వాన వల్ల నీరు రావడంతో తరగతుల నిర్వహణ కష్టమైంది. సమీపంలోని అంగన్వాడీ కేంద్రానికి విద్యార్థుల్ని తీసుకెళ్లి తరగతులు బోధిస్తున్నారు. గతంలో ఈ సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పాఠశాలలోకి నీరు వస్తే అంగన్వాడీ కేంద్రంలో కూర్చోవాలని చెప్పారని ఉపాధ్యాయులంటున్నారు.



రైతులకు డ్రోన్ పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

రైతులకు మందులు పిచికారి చేయడానికి అత్యాధునికమైన డ్రోన్ ను పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని బలుసుపాడు గ్రామంలో రైతులకు కందులు, మినుములు, డ్రోన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. డ్రోన్ పూర్తి ఖరీదు రూ.980000, కాగా ప్రభుత్వ రాయితీ రూ.784000, గ్రూపు వాటా రూ.196000గా వుంది. కార్యక్రమంలో సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు, వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య, ఏఈఓ శివపార్వతి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఫణిశ్రీ, సంధ్య, ఎటుకూరి బ్రాహ్మయ్య, అబ్బయ్య, గంటా పాపయ్య , ఉమామహేశ్వరరావు, నల్లమేకల గోపీక్రిష్ణ, గంటా నాగేశ్వరావు, హనుమంతరావు, మద్దినేని వెంకట్రావు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు చేయొద్దు

ప్రజాశక్తి -రొంపిచర్ల

రైతులు నల్లబర్లీ పొగాకుసాగు చేయవద్దని, ప్రత్యామ్నాయపంటలు వేయాలని మండల వ్యవసాయ అధికారిణి శివలలిత కోరారు. రొంపిచర్ల మండలంలో గోగులపాడు, కొనకంచివారిపాలెం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ పంట సాగు హక్కు పత్రాలను వినియోగించుకోవాలని అన్నారు. నల్లబర్లీ పొగాకు అధికంగా ఉత్పత్తి చేయడం వల్ల ఈఏడాది రైతులకు అనేక సమస్యలు వచ్చాయన్నారు. అందువల్ల మండలంలో నల్లబర్లీ పంట పండించ వద్దని సూచించారు. కౌలు రైతులకు సిసిఆర్‌సిలిస్తామన్నారు. అన్నదాత సుఖీభవలో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

మద్యం దందాతో వైసీపీకి తీవ్ర నష్టం

ప్రజాశక్తి - మాచర్ల

గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం దందా వైసిపి పార్టీని ఖాళీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి జోస్యం చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యం వలన ఎంతో మద్యం ప్రియులు తీవ్ర అనారోగ్యానికి గురైన వారు, మరణించిన వారు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు వారి ఆత్మలు సిట్ రూపంలో వైసిపి పార్టీని నిలదీసి కుంభకోణాన్ని వెలుగులోకి తెస్తుందన్నారు. దీంతో వైసిపి కొండ రాబోయే రోజుల్లో ఖాళీ కుండా మారబోతుందన్నారు. 2029లో కాంగ్రెస్ పార్టీ పూర్తి బలంతో పుంజుకొని రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగరాజు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, ప్రతినిధులు, మాట్లాడుతున్న ఆర్.వి.నరసింహారావు, సీనియర్ నాయకులను సత్కరిస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

కోడ్‌లు అమలు చేస్తున్నారని, 8 గంటల పనివిధానాన్ని 10 గంటలకు పెంచటం, మహిళలతో రాత్రివేళ పనిచేయించే అవకాశం కల్పించటం వంటివి లేబర్ కోడ్‌ల అమలులో భాగమేనని వివరించారు. ఈ నేపథ్యంలో కార్మికులు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోరాటం లేకుండా సమస్య పరిష్కారం కాదన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణపై మొదటి సంతకం పెడతామన్న ప్రభుత్వ వాగ్దానం విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు ఆశపడి భారీ మెజారిటీతో కూటమిని గెలిపించారని, ఇప్పుడు హామీల ఊసే లేదని ఎద్దేవ చేశారు. కార్మికుల శ్రమ లేకుండా అభివృద్ధి లేదని, నాగరికతకు పునాది భవన నిర్మాణ కార్మికులని చెప్పారు. వీరికి భవనాలు కట్టే శక్తి మాత్రమే కాదని, ప్రభుత్వాలకు చరమగీతం పాడే శక్తి కూడా ఉందని గుర్తుంచుకోవాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించే హక్కు ఏ ప్రభుత్వానికి లేదన్నారు. కార్మికుల శ్రమతో పోగుబడిన సెస్‌ను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు ఏడాది రూ.1.5 లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుండి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. లేబర్‌కోడ్‌లు మనుస్మృతి అమలులో భాగమన్నారు. ఓట్ల కోసం ఎన్నికల్లో ఒక మాట, ఎన్నికలయ్యాక మరో మాట మాట్లాడే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మతం పేరుతో కార్మికుల మధ్య చీలిక తెచ్చే మోడీకి బుద్ధి చెప్పాలన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారం చేపట్టి 11 ఏళ్ల అయ్యిందని, ప్రజలకు ఇచ్చి వాగ్దానాలు అమలు చేయలేదని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పేదరిక నిర్మూలన, అధిక ధరల నియంత్రణ చేయలేదన్నారు. పేదల సంఖ్య మరింత పెరిగిందని, మరోవైపు అంబానీ, అదానీ ఆస్తులు భారీగా పెరిగాయన్నారు. కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. విద్య, వైద్యం, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం కాకుండా కార్మికులు అందరూ ఐక్యంగా ఉండి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్.రమణరావు, కె.వి.గోపాలరావు, అనసూయ్య, ఎ.గోపాల్ అధ్యక్షవర్గంగా జరిగిన మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు గత మహాసభ నుండి నేటి వరకూ చేపట్టిన కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని తీర్మానాలు ఆమోదించారు. సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, డి.లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులకు సన్మానం

జిల్లాలో భవన నిర్మాణ కార్మిక ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించిన నాయకులకు ఈ సందర్భంగా సత్కరించారు. రాష్ట్ర నాయకులు శాలువా కప్పి సన్మానించారు. డి.మస్తాన్‌వలి, బోయపాటి అక్కారావు, నక్కా మస్తాన్, మోహనరావు, ఎ.నికల్సన్‌ను నాయకులు, ప్రతినిధులు సత్కరించారు.

పేదరిక నిర్మూలనకు మార్గదర్శకులు ముందుకు రావాలి : కలెక్టర్

ప్రజాశక్తి -మేడికొండూరు

గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు మార్గదర్శకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. స్థానిక వేణుగోపాల స్వామి కళ్యాణ మండపంలో బుధవారం మార్గదర్శకులు - బంగారు కుటుంబం నినాదంతో పి4 కార్యక్రమ గ్రామ సభ జరిగింది. సర్పంచ్ పూల నాగమణి సభకు అధ్యక్షత వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకి ఆధునికత వృద్ధి చెందుతున్నప్పటికీ, అదే అట్టడుగు స్థాయిలో పేదరికం వెంటాడుతూనే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మార్గదర్శకులు బంగారు కుటుంబాలు పి4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. గ్రామస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించి బంగారు కుటుంబాల అర్హులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఒకపక్క ప్రభుత్వ పథకాల ద్వారా వీరికి అందే సహాయం కాకుండానే అదనంగా వారి యొక్క కుటుంబా, వ్యక్తిగత, పరిసరాలు అవసరతలు తీర్చే విధంగా ప్రభుత్వ ,ప్రైవేటు, ప్రజలు భాగస్వామ్యంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా మేడికొండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కావూరి దాస్ తన వంతుగా రూ.50 వేలు కలెక్టర్ కు అందజేశారు. మేడికొండూరు సచివాలయం పరిధిలో 263 కుటుంబాలను, సచివాలయం 2 పరిధిలో 294 గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సచివాలయం 1లో 49, సచివాలయం 2లో 7 బంగారు కుటుంబాలను మార్గదర్శకులు ఎంచుకున్నట్లు ఎంపీడీవో కె.డేవిడ్ ప్రభాకర్ తెలిపారు. కొందరు స్థానికులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ జేడీఏ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బస్సు, మండల స్పెషల్ ఆఫీసర్ వీరాచారి, సిపిఓ శేషశ్రీ, తహశీల్దార్ ఎం.హరిబాబు ఈవోపిఆర్డీ పాటిబండ్ల పూర్ణ శంకరరావు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, పలు శాఖల అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

డిపిఒ ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి - దుగ్గిరాల

పంచాయితీ జిల్లా అధికారి ఎన్.వి.సాయి కుమార్ బుధవారం ఉదయం మండలంలోని కంఠంరజు కొండూరు గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో అమలు జరుగుతున్న పారిశుద్ధ్య పనులపై ప్రజలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గ్రామంలో తడి చెత్త పొడి చెత్త సేకరణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యాల యం వద్ద పి4 గ్రామ సభలో బంగారు కుటుంబాలపై మహిళలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కొండూరు ఝాన్సీ, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఈఓపిఆర్‌డి జవహర్‌లాల్ నెహ్రూ, గ్రామ కార్యదర్శి ఆర్.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



కంచర్లపాలెం, అన్నవరం, గొడవర్రు గ్రామాల్లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మండలంలోని కంచర్లపాలెం, సోమసుందరపాలెం గ్రామాల్లో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంటను ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. ప్రధాని మంత్రి ఫసల్ భీమా కింద వరి పంటల భీమాకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంచర్లపాలెం సర్పంచ్ కోపల్లె మణిమ్మ, సోమసుందరపాలెం కూటమి నాయకులు అర్జున్ గ్రామ పెద్దలు, రైతులు, ఎఈవో, విఎఎలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని అన్నవరం, హనుమాన్‌పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా కార్డులు తీసుకోవాలన్నారు. దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రతి రైతు తప్పని సరిగా తనయొక్క పంటను ఈ క్రాప్ చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మురళి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతలలో బుధవారం సాగులో ఉన్న పత్తి చేలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కె.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్చికి రూ.360, పత్తికి 80 రూపాయలను బీమా పథకం కింద నెలాఖరులోగా చెల్లించాలని, కందికి 40 రూపాయలు వరికి 80 రూపాయలను ఆగస్టు 15లోగా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈవో రాంబాబు నాయక్ ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని గొడవర్రు రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రామకోటేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ - పంట నమోదు గురించి వివరించారు. రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని అన్నారు . మండల వ్యవసాయాధికారి పి. ప్రియదర్శిని మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ నగదు రైతుల అకౌంట్లో పడేందుకు వారి బ్యాంకు ఎకౌంటు కు ఎన్ పి సి ఐ యాక్టీవ్ మరియు ఇనాక్టివ్ లిస్టులను రైతు సేవాకేంద్రం లలో ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.జానకి దేవి, రైతులు పాల్గొన్నారు.

తాడికొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి - తాడికొండ



రివార్డు అందిస్తున్న ఎస్పి

స్థానిక పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బం దికి సూచనలు అందించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. లోక్ అదాలత్‌లలో 50 కేసులు పరిష్కారమయ్యాయని సిఐ వాసు ఎస్పి దృష్టికి తీసుకువచ్చారు. కేసుల పరిష్కారంలో ముఖ్య భూమిక పోషించిన హెూంగార్డ్ సత్యవతిని అభినందిస్తూ రివార్డున అందజేశారు. శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను పునరుద్ధరించాలని సిఐ ఎస్పి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించ డానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఉన్న అవుట్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సిఐకి సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొలం వద్ద ఘర్షణ - నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని రెంటపాళ్ళ గ్రామంలో బుధవారం ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘర్షణలో మాగంటి చినబాబురావు నంబుల కాట్రాజు వల్లెపు రాంబాబు, అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గొర్రెలు మిరప నారుమడిలోకి వెళ్లిన కారణంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. క్షతగాత్రులు సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మాగంటి చిన్న బాబురావు ఫిర్యాదు మేరకు వల్లెపు రాంబాబు మరికొందరిపై కేసు నమోదు చేశారు. అలాగే వల్లెపు రాంబాబు ఫిర్యాదు మేరకు మాగంటి చిన్న బాబురావు మరికొందరిపై కేసు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాగర్ కుడి కాల్వకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడికాల్వకు బుధవారం సాగునీటిని అధికారులు విడుదల చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు అదేశాలతో కుడికాల్వ 3వ గేటు ద్వారా 500 క్యూసెక్కులను డిఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి భారీగా వరద నీటి వస్తుండడంతో సాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా పెరుగుతుండడంతో కుడికాల్వ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు భారతి, సుధా, అనితశ్రీ, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

రాజుపాలెం తహశీల్ధార్‌గా సరోజ

ప్రజాశక్తి-రాజుపాలెం



మండల తహశీల్ధార్‌గా ఎన్.సరోజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో సత్తెనపల్లిలోని ఆర్‌డిఒ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్ధార్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన తహశీల్ధార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, ధ్రువపత్రాలను సకాలంలో ఇస్తామని చెప్పారు.



అనాధాశ్రమానికి ఈశ్వర్ ఇంజినీరింగ్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేసానుపల్లిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రోటరీ క్లబ్ సంయుక్త అధ్వర్యంలో అమ్మనాన్న ప్రేమాలయం (ఆనాధ అశ్రామం)కు బియ్యం, పండ్లు వస్త్రాలను విద్యార్థులు బుధవారం అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. తమ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారని కళాశాల చైర్మన్ షేక్ మీరావలి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్. మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్.నజీమా, ఎన్‌ఎస్‌ఎస్ పిఓహెచ్.గంగాధర్, రోటరీ క్లబ్ నరసరావుపేట ప్రెసిడెంట్ షేక్ కరీం మోహిద్దీన్, సెక్రటరీ మునింద్రరెడ్డి, డైరెక్టర్ షేక్. జిలాని మాలిక్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఇసి ఎన్‌సిసి క్యాడెట్లకు 'బి' సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్సీసీ క్యాడెట్లకు 'బి' సర్టిఫికెట్ల బుధవారం పంపిణీ చేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు హాజరయ్యారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించే గొప్ప వేదిక ఎన్‌సిసి అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబు, 23 ఆంధ్ర బెటాలియన్ నుండి ట్రైనింగ్ జేసీఓ సుబేదార్ మహమ్మద్ సబూర్ పాల్గొన్నారు.

మాచర్ల ఆస్పత్రిలో మరో 3 డయాలసిస్ బెడ్లు

- రక్తనిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం
- సిటి స్కాన్ ఉచితంగా చేసేలా ప్రైవేటు సెంటర్లతో ఎంఒయు
- డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి - మాచర్ల



మాట్లాడుతున్న డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన

మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ విభాగంలో ప్రస్తుతం 7 బెడ్లు ఉండగా రోగుల సంఖ్య ఎక్కువ ఆవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సూచనల మేరకు మరో 3 బెడ్లను త్వరలో ఏర్పాటు చేస్తామని పల్నాడు జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టరు ఎం.ప్రసూన తెలిపారు. బుధవారం ఉదయం ఆమె స్థానిక ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించి విలేకర్లతో మాట్లాడారు. మాచర్లలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రసవం కోసం వచ్చే మహిళలను ముందుగానే వైద్యశాల్లో చేర్చుకుని నోప్పులు రాగనే డెలివరి చేసేందుకు గర్భంతో ఉండే మహిళలకు వైద్యశాలలోనే వసతి కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. రోజు వారి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు వెయింటింగ్ రూమ్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. సిటి స్కాన్ కూడా ఉచితంగా చేసేందుకు ప్రవేట్ డయాగ్నసిస్ సెంటర్లతో చర్చించి ఎంఓయు చేసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులు తమ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులతో వస్తే వారిక ఆయుష్మన్ భారత్ కార్డులు ప్రాసెస్ చేసి ఇస్తారన్నారు. ఈ కార్డుల వలన రోగి తన ఆరోగ్య పరిస్థితులపై ప్రభుత్వం దగ్గర ప్రోఫైల్ క్రియేట్ ఆవుతుందని, రోగి సంవత్సరం తర్వాత వచ్చినా వారి ఆరోగ్య పరిస్థితులను డాక్టర్లు అంచానా వేసి వైద్యం అందిస్తారని వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డు వలన ప్రజలు దేశ వ్యాప్తంగా వైద్య సహయం పొందవచ్చునని చెప్పారు. మాచర్ల పట్టణంలోని అన్ని వర్గాల పెద్దలు, సంస్థల వారితో ప్రభుత్వ వైద్యశాలలో అందించే వైద్యం గురించి వివరిస్తామని, వారంతా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే 100 పడకల వైద్యశాలకు స్థల సేకరణ ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. త్వరలో జరిగే ప్రమోషన్స్, నూతన నియమాకాల్లో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలోని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. డయాలసిస్ విభాగాన్ని నిర్వహించే ఆపోలో సంస్థ రాష్ట్ర మేనేజర్ మధుకిరణ్ మాట్లాడుతూ డయాలసిస్ యూనిట్స్ ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటామని, ఆగస్టు 15 నాటికి మరో 3 బెడ్లు ఏర్పాటు చేస్తామని చెపా్రు. కార్యక్రమంలో వైద్యులు కెపి చారి, లావణ్య, సౌజన్య, దేవి సౌమ్య పాల్గొన్నారు.



పొదుపు చేస్తేనే ఎదుగుతాం

ప్రజాశక్తి - నాదెండ్ల

ప్రతిఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని, డబ్బును ప్రభుత్వ బ్యాంకుల్లోనే దాచుకోవాలనేది భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బిఐ) ముఖ్య ఉద్దేశ్యమని కెనరా బ్యాంక్ సాతులూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మారుతి శ్రీనివాసులు అన్నారు. సాతులూరు సచివాలయం మీటింగ్ హాలు ఆర్‌బిఐ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్థికంగా ఎదగడమనేది పొదుపు చేయడం ద్వారానే సాధ్యమని, ప్రైవేట్ బ్యాంకుల ద్వారా చేసే అప్పులు మన ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీస్తుందని అన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకు సేవలను సక్రమంగా ఉపయోగించుకునేవారి వ్యాపారం అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సాతులూరు బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జన్ ధన్ ఖాతాతో పాటుగా ప్రదానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష, అటల్ పెన్షన్ యోజన లాంటి ఇన్సూరెన్సులు కలిగి ఉండాలని, అవసరానికి మించి అప్పులు చేయకూడదని చెప్పారు. సర్పంచ్ ముసుకు శోభారాణి మాట్లాడుతూ మహిళలు పొదుపు సంఘాల ద్వారా తీసుకున్న డబ్బుని వ్యాపార నిమిత్తం ఉపయోగించుకొని మంచి అభివృద్ధిని సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ పద్మ, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్లు కె.వెంకటేశ్వరరావు, బాజీ, తురకా మంగయ్య మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాన్నారు. ఫోన్లకు వచ్చే ఓటిపిలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో రాఘవయ్య, యానిమేటర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఎరువుల గోదాము వద్ద ఎడిఎ రవిబాబు, ఏవో

ఎరువుల కొరత లేదు : ఎడిఎ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలో ఎరువుల కొరత లేదని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు చెప్పారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఎరువుల గోదామును మండల వ్యవసాయాధికారి బి.సుబ్బారెడ్డితో కలిసి ఎడిఎ బుధవారం తనిఖీ చేశారు. సత్తెనపల్లి మండలం, పట్టణ పరిధిలోని ఎరువుల దుకాణాల్లోని ఎరువుల నిల్వాలు యూరియా 590 మెట్రిక్ టన్నులు, డిఎపి 327 మెట్రిక్ టన్నులు, పొటాష్ ఎరువులు 95 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్సు ఎరువులు 585 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 84 మెట్రిక్ టన్నులు చొప్పున నిల్వలు ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రైతులందరూ వారి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద, ప్రైవేట్ ఎరువుల దుకాణాలు వద్ద నుండి ఎరువులను పొందొచ్చని అన్నారు. వ్యాపారులెవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయాల్లో 10 ప్రణాళికలు అమలు : మంత్రి ఆనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆలయాల్లో అర్చకులకు ప్రతినెలా కనీసం రూ.25 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. నరసరావుపేట పట్టణానికి బుధవారం వచ్చిన ఆయన ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి 'సుపరిపాలన, తొలిఅడుగు' కార్యక్రమంలో పలాఽ్గన్నారు. అనంతరం స్థానిక పట్టాభిరామస్వామి గుడిలో మంత్రి సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామనారాయణరెడ్డి మాట్లాడుతూ దేవాలయాల్లో 10 కీలక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయాల్లో సందర్శకులకు మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమం చేపడుతున్నామని, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పండుగ: ఈ పండుగకు ప్రభుత్వ హోదా ఇస్తామని, 600 మంది వేద పాఠశాల విద్యార్థులకు భృతి ఇస్తామని అన్నారు. అర్చకులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు వేతనాన్ని పెంచుతామని, టిటిడిలో సంభావన ఇస్తామని చెప్పారు. బ్రాహ్మణులతో పాటు బ్రాహ్మణేతరులకు కూడా సమాన హక్కుల కోసం చట్ట సవరణ చేస్తామన్నారు. రాష్ట్రంలోని 5,523 ఆలయాలకు ధూప, దీప, నైవేద్యం కోసం ఒక్కొక్క ఆలయానికి రూ.10 వేల చొప్పున రూ.66.27 కోట్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 998 దేవాలయాల్లో రూ.772 కోట్లతో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నరసరావుపేటలో 22 దేవాలయాలకు ధూప, దీప, నైవేద్యం కోసం నిధులు కేటాయించామని, 5 దేవాలయాల్లో రూ.6 కోట్లతో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయని, కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి ఉన్న అప్పుల్లో రూ.57 లక్షల అప్పును రద్దు చేశామని, మరో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. నరసరావుపేట నియోజకవర్గంలో 37,500 మందికి పింఛన్లు, 45,000 గ్యాస్ కనెక్షన్లకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, 26,200 మంది మహిళలకు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ద్వారా 31,200 మంది రైతులకు సాయం చేస్తున్నామని వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రభుత్వాలు మారుతున్నా పరిష్కారం సున్నా

- వైకుంఠపురం బ్రిడ్జి సమస్యకు పరిష్కారం ఎప్పుడో?
- అధికలోడుతో గడ్డర్లను ఢీకొంటున్న వాహనాలు
- మరోవైపు ట్రాఫిక్ ను స్తంభింప చేస్తున్న కాలువ నీరు

ప్రజాశక్తి - తెనాలి

వైకుంఠపురం రైల్వే బ్రిడ్జి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగు తున్నాయి. రైల్వే బ్రిడ్జి దిగువ ఏర్పాటుచేసిన ఐరన్ గడ్డర్‌కు భారీ వాహనాలు తగులుతున్నాయి. కొన్ని బ్రిడ్జి కింద ఇరుక్కుపోయి ట్రాఫిక్‌నకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. దీనికి తోడు తూర్పు కాలువలో నీటి విడుదల జరిగినప్పుడు బ్రిడ్జి కింద రోడ్డు మీదకు భారీగా నీరు చేరుతుంది. దీంతో నాలుగు లైన్ల రోడ్డు ఉన్నప్పటికీ ఒన్ వే లో వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీర్ఘకాలికంగా ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వాలు మారుతున్నా పరిష్కారం లభించడంలేదు. సమస్యకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తెనాలి చందోలు రోడ్డు మార్గంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైంది. తెనాలి నుంచి పొన్నూరు, బాపట్ల, చీరాల, చందోలు, నిజాంపట్నం, చెరుకుపల్లి, రేపల్లె, కొల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆటోలు, లారీలు, ట్రాక్టర్లు, వివిధ విద్యాసంస్థలకు చెందిన వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఈ రోడ్డులో నిత్యం ప్రయాణిస్తుంటాయి. పైగా చిన్న తిరుపతిగా పేరుగాంచిన వైకుంఠపురం ఆలయానికి పండుగల సందర్భంగా భక్తుల రద్దీ అధికం. ఈ పరిస్థితులలో వైకుంఠపురం రైల్వే బ్రిడ్జి దిగువన ఏర్పాటుచేసిన ఇనుప గడ్డర్లు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రైల్వే, ఆర్ అండ్ బి అధికారులు సమస్యను గుర్తించినా దీర్ఘకాలికంగా చర్చలు, ప్రణాళికలు మినహా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. రైల్వే బ్రిడ్జి దిగువ ఉన్న నాలుగు లైన్ల ఆర్ అండ్ బి రోడ్డు లో లెవెల్లో ఉంది. అది కూడా వాహనాలు వెళ్ళేందుకు వీలుగా గతంలో ఏర్పాటు చేసిందే. పైగా భారీ వాహనాలు రైల్వే బ్రిడ్జిని తాకకుండా ఉండేందుకు బ్రిడ్జికి ఇరువైపులా ఆర్ అండ్ బి రోడ్డుపై ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ మార్గంలో కొల్లూరు ఇసుక రీచ్ ల నుంచి ఇసుకలోడుతో ప్రయాణించే టిప్పర్లు ఎక్కువ. అవి పరిమితికి మించిన లోడుతో ప్రయాణించడం సర్వసాధారణమైంది. టిప్పర్ ట్రక్ నిండుగా మాత్రమే ఇసుకను లోడ్ చేయాల్సి ఉంది. కానీ టిప్పర్ ట్రక్కు నిండినా, దాదాపు మూడడుగుల ఎత్తున ఇసుక నింపుతు న్నారు. ఆ టిప్పర్లు బ్రిడ్జి వద్దనున్న ఇనుప గడ్డర్లకు తగిలి ప్రమాదాలను శంకిస్తున్నాయి. పైగా గడ్డర్ కు తగిలి ఇసుక కింద పడిపోవడంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇసుక ప్రభావంతో వాహన చోదకులు జారిపడి గాయపడిన సందర్భాలు అనేకం. అంతేకాకుండా ఈ రోడ్డులో కొత్తగా వచ్చిన భారీ వాహనాలు గడ్డర్కు తగిలి ఇరుక్కుపోతున్నాయి. దీంతో గంటలకొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఈనెల 21న భారీ వాహనం రైల్వే బ్రిడ్జి కింద ఇరుక్కుపోగా, మరోవైపు ఇసుక టిప్పర్ల రాకపోకలు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసాయి. అంతేకాకుండా తూర్పు కాలువలో నీటి విడుదల జరిగినప్పుడు కాలువ రిటైనింగ్ వాల్ కు ఉన్న రంధ్రాల ద్వారా నీరు భారీగా రోడ్డు మీదకు చేరుతుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు సగానికి పైగా మునిగిపోయే పరిస్థితి. అలాంటి సమయంలో నాలుగు లైన్ల రోడ్డు ఉన్నప్పటికీ వాహనాల రాకపోకలు ఒక వైపే కొనసాగించాల్సి వస్తోంది. ఫలితంగా గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక టిప్పర్లలో అధికలోడును నియంత్రించి, భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గడ్డర్‌కు తగిలి ఇరుక్కుపోయిన భారీ వాహనం



గడ్డర్ కు తగులుతున్న అధిక లోడు ఇసుక లారీ



రోడ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

చెరువులను తలపిస్తున్న రహదారులు : సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని రహదారులు నీటి కుంటలను తలపిస్తున్నాయని సిపిఎం మండల కార్యదర్శి నన్నపని శివాజీ అన్నారు. బుధవారం పెదకాకానిలోని పలు రహదారులను సిపిఎం బృందం పరిశీలించింది ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రోడ్డు, రహదారుల సంస్థ వారు ఇష్టానుసారంగా రోడ్లు వేయడంతో చిన్నపాటికి వర్షానికి నీరు నిలిచి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందు పడుతున్నారన్నారు. పెదకాకాని జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్లో కాకాని బైబిల్ మిషన్ అండర్ పాస్, పల్లాలమ్మ గుడి దగ్గర ఉన్న అండర్ పాస్‌లు చిన్నపాటి వర్షం వస్తేనే జలాశయాలను తలపిస్తున్నాయన్నారు. సంబంధిత సంస్థ వారు సక్రమంగా రోడ్లను వేయకపోవడం వల్ల వాటికి మరమ్మతులు చేయకపోవడం వల్ల రహదారులపై నీళ్లు నిలిచి సమీప కాలనీలో అయిన సదాశివ కాలనీ, గౌడ పాలెం, కాకాని సెంటర్ కెనరా బ్యాంక్ రిజిస్టర్ ఆఫీస్ రైల్వే స్టేషన్‌కి వెనిగండ్ల వెళ్లే రోడ్డు చిన్న వర్షం వస్తే ఆ నీరు, మురుగు నివాసాల్లో కి వస్తుందన్నారు. రోడ్లు మార్గాన వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా అధికారులు గుర్తించి వెంటనే పెదకాకాని సెంటర్లో ఉన్న కల్వర్టుకి అడ్డంగా ఉన్న గోడ తొలగించి మురుగునీరు పోయే విధంగా మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంకూరి నీలాంబరం, కోటిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులు

సాధారణ ఎన్నికల తరహాలో విద్యార్థుల ఎన్నికలు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక జెఎంజె మహిళ కళాశాల విద్యార్థి విభాగం ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. తరగతి లీడర్లు, కళాశాల వివిధ విభాగాలలో నాయకత్వానికి సంబంధించి విద్యార్థినులకు ఎన్నికలు నిర్వహించారు. కళాశాల అధ్యాపక బృందం పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను తలపించే రీతిలో విద్యార్థులు పోటీ చేయడం, దానికి సంబంధించి ప్రచారం నిర్వహించడం, తమకు ఓటు ఎందుకు వేయాలో తెలియజెప్పడం, ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందిని కేటాయించడం, వారికి శిక్షణ నిర్వహించడం, విద్యార్థినులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం వంటి ప్రక్రియ ఆకట్టుకుంది. ఎన్నికల ఫలితాలు గురువారం ఉదయం ప్రకటించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రోజ్ లీనా వెల్లడించారు.

దుర్గమ్మకు ఆషాడ సారే...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బైపాస్ దుర్గా నగర్ శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, తెలుగు మహిళా నాయకురాలు అనిత దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాడ సారే సమర్పించారు. అనంతరం మన్నెం దంపతులు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలు నుంచి ప్రతి ఏడాది అమ్మవారికి ఆషాడ సారే సమర్పిస్తున్నామని అదే మాదిరిగా ఈ ఏడాది కూడా అమ్మవారికి సారే సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భక్త బ అందం ప్రతినిధులు తలశీల జయలక్ష్మి, మన్నెం సుశీల, కట్టా నాని, మన్నెం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు చెక్కు అందచేస్తున్న మేయర్, కమిషనర్, ఎమ్మెల్యే

కార్మికుడు అప్పారావు కుటుంబానికి రూ.5 లక్షలు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక దేవాపురంలో పీకలవాగుపై నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ కూలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడు తోట అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర హామీ ఇచ్చారు. బుధవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకర్గ ఎ మ్మెల్యేతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్‌ను కాంట్రాక్టర్ చేతుల మీదుగా అందించారు. మృతుని కుటుంబ సభ్యుల కోరిక మేరకు వారి జీవన భృతికి రైతు బజార్‌లో షాప్ ఏర్పాటుకు తగిన సాయం అందించటానికి కృషి చేస్తామన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం ఏర్పడి దగ్గర నుండి ప్రజలను మోసం చేసింది అని ప్రత్తిపాడు వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాలసాని కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మండల పార్టీ అధ్యక్షుడు చల్ల హనుమంత్ యాదవ్ అధ్యక్షతన, బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అని ప్రజలను మోసం చేశారు, ఎలక్షన్ల ముందర ఇచ్చిన ష్యూరిటీ బాండ్లను ప్రజలకు చూపిస్తూ చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారని అని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలు గమనించాలని వాటిని గుర్తు చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను ప్రజలతో స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను తెలుసు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.



క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ చేస్తున్న బాలసాని కిరణ్ కుమార్,నాయకులు

పి.ఎ.ఎస్ కళాశాల వ్యవస్థాపకుని జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఫౌండర్ తేళ్ల కృష్ణమ చౌదరి 121వ జయంతి సందర్భముగా కళాశాల పాలకవర్గం తరుపున జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ పి.ఎ.ఎస్ కళాశాలలో అయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తేళ్ల కృష్ణమ చౌదరి పాలపర్రు గ్రామానికి చెందినవారు.జిల్లా జడ్జిగా పనిచేసి రిటైర్డ్ అయిన తరువాత పెదనందిపాడు మరియు పరిసర ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు కళాశాల స్థాపన అవసరమని గుర్తించి, దాతల సహకారంతో పెదనందిపాడు విద్యాభివృద్ధి కొరకు పి.ఎ.ఎస్ కళాశాల స్థాపన కొరకు విశేష కృషి చేశారు. తదనంతరం ది పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీకి ఫౌండర్ సెక్రటరీ, కరస్పాండెంట్‌గా సేవల ందించారు. బుధవారం వారి 121 జయంతి సందర్భ ముగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వీర రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ కే. ప్రతాప్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు మరియు కళాశాల విద్యార్థులు తేళ్ల కృష్ణమ చౌదరి విగ్రహానికి పుష్పాలతో ఘనంగా నివాళులర్పించి వారి జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భముగా కళాశాల పాలకవర్గ అధ్యక్షులు శ్రీ కాళహస్తి సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా లావు రత్తయ్య , ట్రెజరర్ శ్రీ లావు ఆదిశేషయ్య, వైస్ ప్రెసిడెంట్ మందడి చలపతి రావు, కళాశాల పాలకవర్గ సభ్యులు నర్రా వీరయ్య, కృష్ణమ చౌదరి సేవలను కొనియాడారు.



వర్షాకాలం- వ్యాధుల కాలం

అప్రమత్తతే ఆయుధం

ప్రజాశక్తి- తాడేపల్లి

వర్షాకాలం సీజన్లో మామూలుగా వచ్చే చిన్నపాటి వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్ యు పి హెచ్ సి ప్రధాన వైద్యులు డాక్టర్ మానస మంజరి కోరారు. బుధవారం ఆశడే సందర్భంగా హాస్పిటల్ లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్యాధికారిని డాక్టర్ మానస మంజరి మాట్లాడుతూ ఏఎన్ఎంలకు మరియు ఆశాలు ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జ్వరాలు అంటువ్యాధులు వ్యాపించడానికి అవకాశం ఉందని , ప్రజల్ని అప్రమత్తుల్ని చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు మీకు కేటాయించినటు వంటి గృహాలను సందర్శించి ఏమైనా జ్వరాలు, అలానే ఇంకా ఏమైనా అంటువ్యాధులు ఉన్న ఎడల వాటిని సకాలంలో గుర్తించాలని కోరారు. మరియు వ్యాధి నిరోధక టీకాలు 100శాతం జరగాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమం లక్ష్యాల్ని పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఇటీవల జరిగిన సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, మరియు ఎఎన్ఎంలు సాధారణ బదిలీల్లో భాగాంగా యుపిహెచ్‌సి పరిధి నుండి సచివాలయ ఏఎన్ఎంలు ముగ్గురికి అభినందనలు మరియు నూతనంగా వచ్చిన నలుగురు ఏఎన్ఎంలు కుఅభినందనలు తెలియ చేశారు. ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్య కార్యక్రమాలను 100శాతం లక్ష్యాలను పూర్తిచేసే విధంగా కష్టపడి పని పనిచేసి ఆసుపత్రికి మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జయరాజు, ఏఎన్ఎంలు ఆశాలు హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.







వెల్దుర్తి మండలం శిరిగిపాడు, క్రోసూరు మండలం దొడ్లేరు, పిడుగురాళ్ళమండలం జూలకల్లు గ్రామాల్లో జరిగిన పొలంపిస్తోంది కార్యక్రమాల్లో పాల్గొన్న వ్యవసాయాధికారులు

రైతు సేవా కేంద్రాల ద్వారా కౌలు రైతులకు కార్డులు

ప్రజాశక్తి - వెల్దుర్తి

రైతు సేవ కేంద్రాల ద్వారా పంట నమోదు పంట బీమా కౌలు రైతు కార్డులు పొందాలని వెల్దుర్తి మండల వ్యవసాయ శాఖ అధికారి బాలాజీ గంగాధర్ అన్నారు బుధవారం మండలంలోని శిరిగిరిపాడు, మిట్టమీద పల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటను సందర్శించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన స్కీం కింద ఫ్యూచర్ జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ద్వారా బీమా పథకం అమలు చేస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డ్ బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు ధ్రువీకరణ పత్రం, రైతుదారులు కౌలు రైతు కార్డు మీసేవ, సచివాలయం ద్వారా నమోదు చేసుకోవాలని ఏవో బాలాజీ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వి.రాజశేఖర్, డి.అనురాధ, జి.త్రినాథ్, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు - ప్రజాశక్తి

మండలంలోని దొడ్లేరు, అనంతవరం గ్రామాల్లో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ కౌలు రైతులు తప్పకుండా సిసిఆర్సీ కార్డులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని గాని, గ్రామ రెవెన్యూ అధికారిని గాని సంప్రదించి పొందాలన్నారు. అనంతరం గ్రామంలోని వరి నారుమడిని రైతులతో కలిసి పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది బి.మమత, రైతులు పాల్గొన్నారు.

పీసపాడు, ఉయ్యందన గ్రామాల్లో..

క్రోసూరు మండలం పీసపాడు, ఉయ్యందన గ్రామాల్లో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో కౌలు రైతు గొర్రెపాటి గోపికి సాగుదారు హక్కు పత్రం కార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ రామచంద్రరావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది వి.సుబ్బారావు మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తక్కువ కాల పరిమితి పంటలతో రైతులకు మేలు కలుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం సంధ్యారాణి అన్నారు. బుధవారం మండలంలోని జూలకల్లు, పందిటి వారి పాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ రైతులందరు కేఎన్ఎమ్-1638 అనే వరి రకం 120 నుంచి 125 రోజుల పంట మరియు ఒక ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు అవుతుంది అని తక్కువ కాల పరిమితి గల పంటలను సాగుచేసుకోవాలని ఈ రకం బిపిటి 5204 కంటే మంచిరకం కే ఎన్ ఎం 1638 అనే రకం అగ్గితెగులను తట్టుకుంటుంది అని పేర్కొన్నారు. మానుగాయ రాదు అని మరియు గాలులకు పడిపోదు అని సన్న రాకాలను మాత్రమే సాగు చేసుకుంటే మార్కెట్ లో కూడా బాగా డిమాండ్ ఉంటుందని రైతులందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు స్వరూప, వంశీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

కౌలు రైతులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకువెళ్లి గ్రామాలలోని వీఆర్వోలను సంప్రదించి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు తెలిపారు. మండలంలోని శివపురంతండాలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. దేవదాసు మాట్లాడుతూ 2025 ఖరీఫ్ కు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన జులై ఆఖరిలోపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువసేన సహాయకులు వై.ప్రభాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బలుసుపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని బలుసుపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 100 కోట్లకు పైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్రామంలో ఇంటింటికి సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వై బ్రహ్మయ్య, బలుసుపాడు గ్రామ టిడిపి నాయకులు గంట పాపయ్య, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చేయూత

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల లక్ష్మీ కార్తీక రెడ్డి (12), దగ్గుల అఖిల్ రెడ్డి (10) అనే చిన్నారులకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ బుధవారం చేయూత ఇచ్చింది. తల్లిదండ్రులను కోల్పోయి.. ఆర్థిక పరిస్థితులు బాగా ఇబ్బందికరంగా మారి కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. ఈ విషయాన్ని కొత్తపల్లి గ్రామస్తులు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవింద్ రెడ్డికి చేయటంతో ఆయన వెంటనే స్పందించి ఆ చిన్నారులు ఇద్దరికీ చదువు పూర్తయ్యేంతవరకు బాధ్యత తీసుకుంటున్నానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మెట్టు గోవిందరెడ్డిని అభినందించారు.



గాయపడిన మహిళలు

ఆటోబోల్తా పడి ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

రెంటచింతల మండలం మంచికల్లు నుండి కూలీలతో వస్తున్న ఆటో పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి సమీపంలో గుంతను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో 8 మంది కూలీలకు గాయాలైనాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. గాయాలైన వారిని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. స్థానిక 25, 26 వార్డులకు చెందిన భవన నిర్మాన మహిళా కార్మికులు మంచికల్లు గ్రామంలో కాంక్రీట్ పనులకు వెళ్ళి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

విశ్వశాంతి పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో

ప్రజాశక్తి - నకరికల్లు

స్థానిక విశ్వశాంతి స్కూల్‌లో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలు జోలికి విద్యార్థులు , యువత వెళ్లకూడదన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా ఉన్నారు ఎదగాలన్నారు. అనంతరం బస్సు డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం : యాగంటి మల్లికార్జునరావు



మాట్లాడుతున్న యాగంటి మల్లికార్జునరావు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం అని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన పి4 సమీక్ష సమావేశ కార్యక్రమంలో కూటమి నేతలతో కలసి మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున్ రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పేదరికంలో ఉన్న చదువుకున్న నిరుద్యోగుల ఉపాధికి, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి వారికి ఉద్యోగ అవకాశాలు ఉపాధి కల్పించడం, విద్యార్థులకు ఉన్నత చదువులు చదువుకోడానికి తోడ్పాటు ఇవ్వడం, స్వయం ఉపాధి ద్వారా చిన్నచిన్న వ్యాపారాలను, కుటీర పరిశ్రమలు పెట్టుకోవటానికి ఆర్థిక సహాయం చేయడమే కాకుండా కులవృత్తులకు, ఆయా రంగాలలో వారికి చేయూత అందించి వారిని ఆర్థికంగా పైకి తీసుకురాటం జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుల మద్దిగపు వెంకటరామిరెడ్డి, బండ్ల బ్రహ్మం, సచివాలయ అడ్మిన్ శ్రీలక్ష్మీ , పులుసు రఘు రెడ్డి, చందు గౌడ్ , సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర శిశు సంక్షేమ కార్యాలయాన్ని క్రోసూరుకు తరలించాలి

ప్రజాశక్తి - క్రోసూరు

పల్నాడు జిల్లా క్రోసూరు మండలానికి కేటాయించిన సమగ్ర శిశు సంక్షేమ సేవా పథకం కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న 75 తాళ్లూరు గ్రామం నుండి క్రోసూరు గ్రామానికి తరలించాలని మానవ హక్కుల సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిర్రా రాజేష్ కుమార్ బుధవారం కోరారు. ఈ మేరకు ఆయన క్రోసూరు తహశీల్దార్ వెంకట నాగరాజు, ఎంపీడీఓ రవి కుమార్‌లను కలిసి కార్యాలయ తరలింపు అవసరాన్ని వివరించారు. తాళ్లూరులో శిధిల భవనంలో కొనసాగుతున్న కార్యాలయం సిబ్బంది పనితీరుకు తీవ్ర అంతరాయం కలిగించడమే కాకుండా, అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణలో లోపాలు, గుడ్లు, పాలు, బాలామృతం సరఫరాల్లో నియమాల ఉల్లంఘనలు, ఖాళీ బిల్లులతో అవినీతి వంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయని ఆయన చెప్పారు. క్రోసూరు పేరు ప్రతిష్టకు ఎలాంటి భంగం కలగకూడదన్న బాధ్యత మనందరిపై ఉన్నదని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా కార్యాలయాన్ని తక్షణమే క్రోసూరుకు తరలించాలన్నారు. ఈ సూచనపై అధికారులు సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వైద్య అధికారులను ఆదేశించారు. సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ గైల్ స్వచ్ఛంద సంస్థవారు హాస్పిటల్‌కి బహుకరించిన పరికరాలు, ఫర్నీచర్ పరిశీలిచారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ స్కీమ్ గురించి ఆరా తీశారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆసుపత్రి సూపరిండెంట్ లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆర్ అండ్ బి కార్యాలయంలో నిర్మించిన గెస్ట్ హౌస్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

పట్టణంలోని రఘురామ్ నగర్ టిడిపి ప్రజావేదిక లో సిఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. 87మంది లబ్దిదారులకు 79లక్షల 59 వేల 226 రూపాయల విలువైన చెక్కులను అందచేశారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 24 వార్డులో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మస్తాన్ వలీ మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి శ్రీనివాసరావు టిడిపి నాయకులు యెలినేడి రామస్వామి దరువూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు

వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. స్థాని పిహెచ్‌సి పరిధిలోని ముప్పాళ్ల, గోళ్ళపాడు గ్రామాల్లో బుధవారం పర్యటించిన వైద్యసిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒకరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటూ దోమతెరలు వాడాలన్నారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, పిహెచ్‌సి వైద్య సిబ్బందితో ముప్పాళ్ల గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు పీటర్ డామియెన్, దస్తగిరి సీనియర్ అసిస్టెంట్ ఉస్మాన్,హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోపిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



వైసిపి రాష్ట్ర కార్యదర్శులుగా నూతనంగా నియమితులైన నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల శివారెడ్డి, గురజాల నియోజక వర్గానికి చెందిన ఎనుముల మురళీధర్ రెడ్డిలు బుధవారం నరసరావుపేట వైసీపీ కార్యాలయంలో పల్నాడు జిల్లా వైసీపీ కార్య నిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ గోపిరెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ ఎదుగుదలకు సహకరించినందుకు వారు కఅతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైసీపీ విజయ బావుటా ఎగరవేస్తుందని నరసరావుపేట నియోజకవర్గంలో తిరిగి గోపిరెడ్డి అఖండ మెజార్టీతో గెలుస్తారని, వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు.

అచ్యుతానందన్ సేవలు చిరస్మరణీయం





పెదకాకాని, నిడమర్రులో అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పెదకాకాని

కేరళ సిపిఎం నేత, మాజీ సీఎం వి.ఎస్.అచ్యుతానందన్ సేవలు చిరస్మరణీయమని స్థానిక సిపిఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. బుధవారం సుందరయ్య కాలనీలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అచ్యుతానందన్ మృతికి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. బేతపూడి బాబురావు అధ్యక్షతన అచ్యుతానందన్ సంతాప కార్యక్రమం జరిగింది. కేరళ రాజకీయాల్లో చెరగనిముద్ర వేసిన అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని శివాజీ అన్నారు. 85 సంవత్సరాల పాటు కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. 17 సంవత్సరాల వయసులోనే కమ్యూనిస్టు పార్టీలో చేరిన విఎస్ కేరళలో జరిగిన ఎన్నో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని అన్నారు. పోలీసులు అచ్యుతా నందన్ ను నిర్బంధించి తీవ్రమైన హింసలకు గురిచేసిన వెనకడుగు వేయకుండా కడదాకా కమ్యూనిస్టుగా జీవించిన ఆదర్శ కమ్యూనిస్టు అచ్యుతానందన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి బి.బాబురావు, నాయకులు సాంబయ్య సత్యనారాయణ, ఎస్.నీలాంబరం, సుందరయ్య కాలనీ వాసులు ఎ. నాగేశ్వరరావు, పి.లింగమ్మ, ఆర్.వెంకట రమణ, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి నిడమర్రు ఒకటి రెండు శాఖల ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. తొలుత ఆయన చిత్రపటానికి కట్టెపోగు ప్రకాష్‌రావు పూలమాలు వేశారు. అనంతరం ఏర్పాటు సంతాప సభకు సిపిఎం పార్టీ డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు అధ్యక్షత వహించారు. గైరుబోయిన నాగేశ్వరావు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీ భావాలకు ఆకర్షితుడై తదానంతరం సిపిఎంలో కొనసాగుతూ ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ రూపాయి కూడా సంపాదించుకోకుండా ఇప్పటికీ ప్రభుత్వ హాస్పిటల్లో చేయించుకుంటూ కొడుకు దగ్గరే నివాసం ఉన్నారని, ఇలాంటి నిస్వార్ధ నాయకులను చూడలేమని గ్రామ స్థాయిలో ఏదైనా పదవి వస్తే లక్షల రూపాయలు సంపాదించే కాలంలో అచ్చితానందన్ లాంటి వారిని మరల మనం చూడలేని ప్రజలు రాజకీయ నాయకులు తమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కట్టెపోగు నాగేశ్వరరావు, కుంపటి వీరయ్య, కట్టెపోగు బుల్లబ్బాయి, మంచి కల పూడి అంకమ్మరావు, ఎమ్మెల మరియదాసు, కట్టెపోగు మాధవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సుగుణ బేగం

రైతులు పంట పొలంలో నిలిచిన నీరు పోయే విధంగా చూసుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రైతులు అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీరు బయటకు పోయే విధంగా చూసుకోవాలని స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ సుగుణ బేగం తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండలం మూడవ సచివాలయం పరిధిలో, తిక్కిరెడ్డి పాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలో పోషకాలు రావాలంటే 19.19.19 లేదా యూరియా ఒక కేజీ ఎకరకి 20 లీటర్ల నీళ్లలో స్ప్రే చేయాలని తెలిపారు.అలాగే కౌలు కి వ్యవసాయం చేస్తున్న రైతులు కౌలు కార్డులు తీసుకోవాలని తెలిపారు. రైతులందరూ పంట నమోదు తప్పనిసరిగా చేయించు కోవాలని తెలిపారు. కిసాన్ డ్రోన్స్ 80శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల రైతులు తీసుకోవాలని తెలిపారు.

తొలి దశలోనే వ్యాధులను గుర్తిస్తే చికిత్స సులభం

ప్రజాశక్తి - పెదకాకాని



మాట్లాడుతున్న డాక్టర్ పి.ప్రవీణా దీప్తి

తొలి దశలోనే వ్యాధులను గుర్తిస్తే చికిత్స సులభమని పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.ప్రవీణా దీప్తి తెలియజేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా ఈ కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మన పరిసరాలలో నీటి నిల్వలు ఎక్కువ ఏర్పడి దోమలకు నివాసాలుగా మారి ప్రజలను విష జ్వరాలకు గురిచేస్తాయన్నారు. తొలి దశలోనే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు గుర్తిస్తే తేలికపాటి చికిత్సతో వాటిని నివారించవచ్చు అన్నారు. వైద్యశాలలో డెంగ్యూ, మలేరియా, ఇతర రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పిల్లలకు టీకాలు అలాగే కుక్క కాటుకు ర్యాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంన్నారు. గర్భిణీలకు కాన్పు సమయంలో తల్లి బిడ్డకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని నిర్ధారించు కుంటే ఇక్కడే కాన్పు చేస్తామని తెలిపారు. ప్రాథమిక వైద్య కేంద్రాలలో నార్మల్ డెలివరీకి తాము నూరు శాతం ప్రయత్నిస్తున్నామన్నారు.

బాధితురాలికి రూ.10 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

ఊపిరితిత్తుల మార్పిడికి, శస్త్ర చికిత్స చేయించుకునేందుకు చిర్రావూరు గ్రామానికి చెందిన టంకశాల ఏసుబాబు భార్య వీరనాగులకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంజూరు చేసిన పది లక్షల రూపాయల చెక్కును మంగళగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు ముమ్మిడి సత్యనారాయణ ద్వారా టిడిపి నాయకులు బుధవారం బాధితురాలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ, అనేక హాస్పిటల్స్‌లో వైద్యం కోసం తిరిగిన సరైన వైద్యం అందలేదు. ఇటీవల హైదరాబాద్ నగరంలో యశోద హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకోగా వైద్యులు రిపోర్టులు పరిశీలించి, బాధితురాలికి ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. అనారోగ్య బాధితురాలు కుటుంబ ఆర్థిక పరిస్థితిని కూటమి నాయకులు మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ దఅష్టికి తీసుకువెళ్లగా నేనున్నానని బాధితురాలికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు నిమిత్తం 10 లక్షల రూపాయలను మంత్రి నారా లోకేష్ మంజూరు చేశారు. మంత్రి మంజూరు చేసిన పది లక్షల రూపాయలు చెక్కును మంగళగిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మిడి సత్యనారాయణ, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, మంగళగిరి మార్కెట్ యార్డ్ డైరెక్టర్, టిడిపి చిర్రావూరు గ్రామం మాజీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు ఊపిరితిత్తుల బాధితురాలు ఇంటికి వెళ్లి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా టంకశాల వీర నాగులు కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోకల పాములు, నన్నపనేని అర్జునరావు, మక్క పాటి రవి, మక్కపాటి మధు, దనేకుల శ్రీకాంత్, అఖరం శెట్టి చిన్నబ్బాయి, మేకల మహేశ్వరరావు, పోకల శ్రీను, యాదగిరి శ్రీనివాస్, పోకల వెంకటేశ్వరరావు, వెలువోలు కిరణ్, కొంక ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.




లబ్ధిదారుడికి డ్రోన్ అందజేస్తున్న టిడిపి నాయకులు

రైతు మిత్ర గ్రూపు సభ్యుడుకి డ్రోన్ అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

చిర్రావూరు గ్రామానికి చెందిన ఎన్టీఆర్ రైతు మిత్ర గ్రూపు సభ్యుడు ధనేకుల వేణుకి బుధవారం తెలుగుదేశం నాయకులు 80 శాతం సబ్సిడీపై డ్రోన్ అందజేశారు. ఈ సందఠరేగా టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ మాట్లాడుతూ డ్రోన్ వినియోగంతో సమయం, డబ్బు రైతుకు ఆదా అవుతుందని అన్నారు. ఆధునిక టెక్నాలజీ వలన రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, జనసేన మండల నాయకులు సిహెచ్.లాల్‌చంద్, జనసేన గ్రామ అధ్యక్షులు ఎ.కాళీ కృష్ణ, వ్యవసాయ అధికారిని శిరీష, ఏఈఒ రమేష్ బాబు, పావని, గ్రామ రైతులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న తిలక్‌బాబు

ఎన్ఆర్ఐలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి -మేడికొండూరు

ఎన్ఆర్ఐ కళాశాలలో ఎన్ఆర్ఐల సహకారంతో నూతనం ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించాలని, పోటీ ప్రపంచంలో తమ విద్యార్థులు ఉపాధి కల్పనకు మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ల్యాబ్‌ని ఎన్నారైల సహకారంతో ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉపయోగించుకుని మంచి కంప్యూటర్ పరిజ్ఞానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే, క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తూ, ప్రత్యేక శిక్షణ ద్వారా మంచి పరిజ్ఞానం అందించి విద్యార్థులను పోటీ ప్రపంచంలో మంచి ప్యాకేజీతో ఉద్యోగ కల్పన ధ్యేయంగా తమ కళాశాల అధ్యాపక బృందం ప్రయత్నం చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఏవో బి.సీతారామయ్య, డేటా సైన్స్ విభాగాధిపతి భవాని, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కోటేశ్వరరావు, ఐటిహెచ్‌ఓడి సౌజన్య , బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితిపై హైకోర్టు వ్యాఖ్యలపై హర్షం : కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు విజ్ఞాపనలు ఇచ్చినా అరకొర సదుపాయాలే గాని, పూర్తి వసతులు-అన్ని హాస్టళ్లలో ఏర్పాటు చేయడం లేదని, వీటి నిర్వహణ - పర్యవేక్షణలపై హైకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలంటూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇక నుండైనా అవినీతికి తావులేని నిర్వహణ- పర్యవేక్షణా పద్ధతులను అధికారులు అవలంభించాలని కోరారు. ఐదేళ్లకోసారి వచ్చే ప్రతి ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల కోసం వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయన్నారు. కానీ విద్యార్థులు పడుకోవడానికి కనీసం మంచాలు-పరుపులు కూడా లేకుండా నేలపై పరుండ బెట్టడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు కేటాయించే నిధులన్నీ అవినీతి అధికారులు-గుత్తేదారులకు లబ్ధి చేకూర్చేందుకే పనులు చేపడుతున్నారా?.. అంటూ ధర్మాసనం ప్రశ్నించాల్సి రావడం విచారకరమన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరన్నా తమ బిడ్డల్ని కటిక నేలపై పరుండ బెడతారా?.. అంటూ, అటువంటప్పుడు హాస్టళ్లలో ఉండే నిమ్నకుల-పేద వర్గాల బిడ్డలను మంచాల పైన-పరుపుల పైన పండుకొని, సుఖ నిద్రకు అవకాశం ఎందుకు కల్పించలేక పోతున్నారంటూ హైకోర్టు ప్రశ్నించాల్సి రావడం, ప్రభుత్వ వర్గాలకు చెంపపెట్టుగా భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అన్ని ప్రభుత్వ హాస్టళ్ల లో కనీస మౌలిక సదుపాయాలు-నాణ్యమైన ఆహారం,విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులదేనన్నారు.

ఆగిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు గ్రామసభకు హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి రోడ్డు నిర్మాణ పనులను రైతు అడ్డుకుంటున్నాడు అనే విషయాన్ని స్థానిక రైతులు తీసుకొచ్చారు. ఆ రైతులతో కలిసి ఆ రోడ్డును పరిశీలించేందుకు కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం వెళ్లారు. మేడికొండూరు నుండి ఫిరంగిపురం మండలం వేమరానికి తాళ్లూరు మీదుగా 11 కిలోమీటర్ల దూరం రోడ్డును నిర్మాణం చేపట్టారు. మేడికొండూరుకు అతికొద్ది దూరంలో 100 మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు జరగకుండా మన్నవ శివరామయ్య, అతని కుమారుడు వెంకట నరసయ్యల ఆడుకుంటున్న విషయాన్ని కలెక్టర్ దృష్టి తెచ్చారు. నిర్మాణ పనులు ఆగిన ప్రాంతాన్ని పరిశీలిం చారు. దీనిపై ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులు రైతులతో మాట్లాడి సమస్యను సమీక్షిస్తారు. చిన్నప్పటికి సమస్య కొలిక్కి రాకపోతే చట్టపరమైనటువంటి చర్యలు చేపట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని కలెక్టర్ హుకుమ్ జారీ చేశారు.

పి4తో పేదరికం నిర్మూలన

ప్రజాశక్తి - తెనాలి

పేదరికాన్ని నిర్మూలించి అభివృద్ధి వైపు నడిపించేందుకే పి-4 విధానాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పి-4కు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. తెనాలి విజన్ యాక్షన్ ప్లాన్ అమలు పై అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 14,280 బంగారు కుటుంబాలను గుర్తించామని, వారికి సహాయపడేందుకు 376 మంది ముందుకు వచ్చారని, వారు 3289 మందిని దత్తత తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చిన వారి డేటా పరిశీలించి, బంగారు కుటుంబాల వారికి చదువు, ఉపాధి, వైద్యం తదితర సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం తెనాలి అభివృద్ధికి రోడ్డు మ్యాప్‌లా ఉండాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ సంజనసింహా, మున్సిపల్ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు, తెనాలి కొల్లిపర మండలాల తహశీల్దార్లు కె.వి. గోపాలకృష్ణ, జి.సిద్దార్థ, ఎంపీడీవోలు అత్తోట దీప్తి, ఎంపీడీవో కె.విజయలక్ష్మి, స్వర్ణాంధ్ర రిజర్వ్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



విజయ్‌బాబును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హిందూ ఫార్మసీలో అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజీలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ వారి సహకారంతో కళాశాల అధ్యాపకులకు బ్లూమ్స్ టెక్నాలజీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ ఇనిషియేట్ కమిషనరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఓఎస్‌డి డాక్టర్ కోగంటి విజయ్‌బాబు మాట్లాడుతూ ఆదర్శ అధ్యాపకునికి ఉండాల్సిన లక్షణాలు, విద్యార్థుల మూల్యాంకనాల అభివృద్ధికి బ్లూమ్స్ టెక్నాలజీ ఉపయోగించే విధానం, అధ్యాపకులు తమ బోధన విధాన ప్రణాళికకు సహకరించే విధానాల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ విధానం పాటించటం వల్ల దిగువస్థాయి విద్యార్థులను ఎగువ స్థాయి విద్యార్థులు అభివృద్ధి చేయొచ్చున్నారు. మిల్లర్స్ టాక్సానమీ, వైద్య విద్యా బోధనలో ఏవిధంగా ఉపయోగించవచ్చో వివరించారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు పాల్గొన్నారు. అధ్యాపకులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందచేశారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి అరవింద్



ర్యాగింగ్, సైబర్ నేరాలపై టిజెపిఎస్‌లో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజీలో బుధవారం ఇంటర్మీడియట్, డిగ్రీ, పిజి విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్ క్రైమ్ గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కె.అరవింద్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ భూతం జోలికి వెళ్లి అందమైన జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని కోరారు. ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని తల్లితండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని చక్కగా చదువుకోవాలన్నారు. ప్రస్తుత రోజుల్లో అందరూ సెల్‌ఫోన్స్ వినియోగించడం వల్ల సైబర్‌క్రైమ్ నేరాలు కూడా పెరిగాయన్నారు.సైబర్ క్రైమ్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అనవసరమైన మెసేజ్‌లు, ఇతర లింక్‌లు, మనకు ఆశచూపి మీరు లాటరీ గెలుచుకున్నారనే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్ కామేశ్వరశాస్త్రి, పిజి ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు, యస్ఐ రామాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, కళాశాల యాంటీ ర్యాగింగ్ కన్వీనర్ మేజర్ పి.కుమార్‌రాజా, సభ్యులు సిహెచ్.రాంబాబు, డాక్టర్ జెవి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్



పి4పై పారిశ్రామిక వేత్తలకు అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

అట్టడుగు వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పి4 కార్యక్రమంను విజయవంతం చేయటానికి బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకొని అవసరమైన సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లో పి4 కార్యక్రమంపై జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న పది శాతం వ్యక్తులు మార్గదర్శులుగా, అట్టడుగున ఉన్న 20 శాతం బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించటమే ప్రభుత్వ, దాతలు, ప్రజలు భాగస్వామ్యం కార్యక్రమని అన్నారు. ప్రభుత్వం విజన్ 2047 స్వర్ణాంధ్ర సాధన దిశగా శ్రీకారం చుట్టిన పి4 కార్యక్రమంలో మార్గదర్శులు భాగస్వాములై బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాటానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సిపిఓ శేషశ్రీ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ బాధితులు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భవనాలు కోల్పోతున్న వారికి హైకోర్టు ఆదేశాల మేరకు 2013భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించిన తర్వాతనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని షాపు యజమానులు కోరారు. బుధవారం స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బ్రాడీపేట, అరండల్‌పేట షాప్ ఓనర్స్ అండ్ షాప్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియ పూర్తి అయిన తర్వాతనే బ్రిడ్జి పనులు చేపట్టాలని కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా హడావుడిగా పిల్లర్స్ వర్క్ ప్రారంభించారన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ఇచ్చిన వర్క్ ఆర్డర్‌లోనే బ్రిడ్జి నిర్మాణానికి ముందుగానే రోడ్డు విస్తరణ పనులు, కాల్వల నిర్మాణం, విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. కానీ ఇవేవీ పూర్తి చేయలేదన్నారు. అధికారులు ఇదే విధంగా ముందుకు వెళితే కోర్టు ధిక్కరణ అవుతుందన్నారు. అదే విధంగా అందరికీ ఆమోదంగా ఉండే డిజైన్ ప్రకారం ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటర్ వరకూ సింగిల్ పిల్లర్ ఫ్లైఓవర్‌తోపాటు, ఆర్‌యుబిలు కూడా నిర్మిస్తే వాహనాలు సులభంగా ప్రయాణిస్తాయన్నారు. 70 ఏళ్లగా అభివృద్ధి చెందిన శంకర్ విలాస్ సెంటర్ కూడా బ్రతికి ఉంటుందన్నారు. ఎర్ర వాల్‌తో కూడిన ప్రస్తుత డిజైన్‌తో బ్రిడ్జి నిర్మిస్తే ఈ ప్రాంతం పూర్తిగా నిర్వీర్యం అవుతుందన్నారు. అసోసియేషన్ నాయకులు జి.కార్తిక్ మాట్లాడుతూ తాము బ్రిడ్జి నిర్మాణనానికి, అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు. పరిహారం కింద బాండ్లు ఇస్తే తీసుకోమని, భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని కోర్టుకు వెళ్లగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పును అమలు చేయమని కోరుతున్నామన్నారు. కానీ ఇంత వరకూ భూసేక రణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. అధికారుల స్పందనను బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ షాపుల యజమానులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రహదారులను సిద్ధం చేసుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు ప్రారంభం అవుతున్న దృష్ట్యా ప్రధాన రహదారులను ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో జిఎంసి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణ పనులు ప్రారంభమైనందున నగరంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా జిఎంసి వైపు నుండి పక్కగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రత్యామ్నాయ రోడ్లలో ఇరువైపులా ఆక్రమణలు తొలగింపు పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను, రోడ్లకు మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ 3 వంతెనల వద్ద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సదరు వంతెన ప్రాంతాల్లో జిఎంసి చేపట్టాల్సిన డ్రైన్ నిర్మాణ పనులు ఉంటే చేపట్టాలని ఈఈని ఆదేశించారు. కంకరగుంట ఆర్‌యుబి వద్ద వర్షానికి నీరు నిలిచి రాకపోకలు జరగడానికి వీలు ఉండడం లేదని, అక్కడ ప్రస్తుతం ఉన్న మోటర్లకు అదనంగా ఏర్పాటు చేసి, వర్షాకాలం ముగిసే వరకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. రోడ్ల మీద ఆక్రమణలను నగరపాలక సంస్థ తొలగిస్తుందని, వాటిని పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక సిబ్బందికి ట్రాఫిక్ పోలీస్ సహకరించాలన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా నగరంలో ఇంకా ఏమైనా రోడ్ల అభివద్ధి చేయాలని ట్రాఫిక్ పోలీసులు గుర్తిస్తే తమ దష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ట్రాఫిక్ సిఐలు అశోక్, వీరాస్వామి, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, ఏసిపిలు రెహ్మాన్, వెంకటేశ్వరరావు, డిఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్సిటీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

త్వరలో ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి బీటెక్, ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంలో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ కోర్సులలో సెల్ సపోర్ట్ కేటగిరి సీట్ల భర్తీకి బుధవారం నిర్వహించిన ఏఎన్యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష విజయ వంతంగా ముగిసిందని ఎఎన్‌యు పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 114 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, ప్రవేశ పరీక్షకు 86 మంది హాజరయ్యారని ఆయన చెప్పారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను త్వరలో విడుదల చేస్తామన్నారు. ఆయా కోర్సులలో కేటగిరీ సీట్లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని ఆయన వివరించారు. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని విశ్వవిద్యాలయంలోని తమ కార్యాలయంలో నేరుగా సంప్రదించి పొందవచ్చని బ్రహ్మాజీరావు పేర్కొన్నారు.



బ్రాకీథెరపీ యూనిట్‌ను ప్రారంభించిన డాక్టర్ ఎస్ఎస్‌వి.రమణ, ఇతర వైద్యులు

ఆర్క హాస్పిటల్‌లో బ్రాకీథెరపీ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్క హాస్పిటల్‌లో బుధవారం అత్యాధునిక ఎలెక్టా ఫ్లెక్సిట్రాన్ బ్రాకీథెరపీ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ ఆర్క హాస్పిటల్ గుంటూరులో అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి తీసుకురావటంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పారు. ఇటువంటి బ్రాకీథెరపీ పరికరాన్ని జిల్లాలో అందుబాటులోకి తేవటం ఎంతో గొప్ప విషయం అన్నారు. హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ పవన్ రాఘవరెడ్డి, డాక్టర్ హేమంత్ మాకినేని, రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజునాయుడు పాల్గొని మాట్లాడుతూ బ్రాకీథెరపీ ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా నిలిచిన సాంకేతికత అని, దీని ద్వారా క్యాన్సర్ రోగులకు అత్యంత ఖచ్చితమైన, మృదువైన, వేగవంతమైన చికిత్స అందించగలమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.హిమని, డాక్టర్ మద్ది శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.